సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట: శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వారం పాటు ఈ వేడుకలు కొనసాగనున్నాయి.

IIలో▸



వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

సిరిసిల్లటౌన్: కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
29.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

సం'కుల' సమరం!

- సామాజిక వర్గాల 'వార్'
- సిరిసిల్ల బరిలో 21 మంది..
- వేములవాడలో 16 మంది పోటీ
- ఒకే కులానికి చెందిన వారి మధ్య పోటాపోటీ
- తలపట్టుకుంటున్న కులసంఘాల పెద్దలు



జంగ్ తెలంగాణ

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో వింత పరిస్థితి నెలకొంది. ఎన్నికల బరిలో గతంలో ఎన్నడూ లేనంతగా ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో సామాజికవర్గాల మధ్య సం'కుల' సమరంగా సాగుతోంది. ఎన్నికల్లో కుల, మత ప్రస్తావనలు తేవద్దనే నిబంధనలు ఉన్నా సామాజిక వర్గాల మధ్య సాగుతున్న 'వార్' ఆసక్తికరంగా మారింది. సిరిసిల్ల అసెంబ్లీ స్థానానికి 21 మంది పోటీ పడుతుండగా.. వేములవాడలో 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒకే సామాజికవర్గానికి చెందిన అ భ్యర్థులు ప్రధాన పార్టీల టిక్కెట్లు పొంది పోటీ పడుతున్నారు. ఫలితంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో సం'కుల' సమరం అనివార్యమైంది.

సిరిసిల్ల బరిలో..

సిరిసిల్ల శాసనసభ స్థానానికి అధికార బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్‌ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు సామాజికవర్గం నుంచి ఒకే ఒక్కడు పోటీలో ఉన్నారు. అదే మిగతా ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారిలో ఒకే సామాజికవర్గంలో ఇద్దరు బరిలో ఉన్నారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్‌ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డి ఉండగా.. అదే సామాజికవర్గానికి చెందిన రాణిరుద్రమరెడ్డి బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు ప్రధాన పార్టీల టిక్కెట్లు సాధించి పోరులో నిలిచారు. బీఎస్పీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పిట్టల భూమేశ్‌ముదిరాజ్‌ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లపై ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా ముదిరాజ్‌ సామాజికవర్గం ఓటర్లపై గురిపెట్టగా.. అదే సామాజికవర్గానికి చెందిన జంగిడి మధుముదిరాజ్‌ పోటీలో ఉన్నారు. పద్మశాలి సామాజికవర్గం ఆత్మగౌరవ పోరాటానికి తెరలేపింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన సెస్‌ మాజీ వైస్‌చైర్మన్‌ లగిశెట్టి శ్రీనివాస్‌ బీజేపీ టిక్కెట్‌ ఆశించి భంగపడి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. సిరిసిల్ల ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలతో సుపరిచితుడిగా ఉన్న లగిశెట్టి శ్రీనివాస్‌ సిరిసిల్లలోని పద్మశాలి సామాజిక వర్గం ఓట్లకు గాలం వేశారు. బ్యాట్‌గుర్తుతో నియోజకవర్గంలోని కులసంఘాల వారితో సమావేశాలు నిర్వహిస్తూ.. ఓట్లు సాధించాలని భావిస్తున్నారు. అదే సామాజికవర్గానికి చెందిన పత్తిపాక సురేశ్‌ ఫార్వర్డ్‌బ్లాక్‌ పార్టీ అభ్యర్థిగా సింహం గుర్తుతో బరిలో నిలిచారు. సిరిసిల్లలో ఆరు నెలలుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. పద్మశాలి ఆత్మగౌరవ సభను నిర్వహించి కులసంఘంలో గౌరవాన్ని చాటుకున్నారు. సిరిసిల్ల ఓటర్లు, యువఓటర్లపై ఆశలతో పత్తిపాక సురేశ్‌ సాగుతున్నారు. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన రిక్కుమల్ల మనోజ్‌కుమార్‌ కూడా ఎన్నికల బరిలో ఉన్నారు. సిరిసిల్లలో వివిధ సామాజికవర్గాలకు చెందిన 21 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే.. సామాజిక వర్గాల వారీగా ఒకే కులానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీ పడడం విశేషం.

వేములవాడలోనూ..

వేములవాడ నియోజకవర్గంలోనూ సంకుల సమరం తప్పడం లేదు. ఇక్కడ ప్రధానంగా అధికార బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న చలిమెడ లక్ష్మీనర్సింహారావు, బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు వెలమ సామాజికవర్గానికి చెందిన వారు. ఆయా సామాజికవర్గానికి చెందిన పలుకుబడి కలిగిన నేతలు ఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు గతంలో కరీంనగర్‌లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసినా.. బీజేపీ అభ్యర్థి మాత్రం తొలిసారి ఎన్నికల బరిలో నిలిచారు. మరోవైపు కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆది శ్రీనివాస్‌కు ఆయన సామాజికవర్గానికి చెందిన మరో అభ్యర్థి గోలి మోహన్‌ బీఎస్పీ టిక్కెట్‌ పొంది ప్రచారం చేస్తున్నారు. ఈ ఇద్దరు మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో సంకుల సమరం తప్పడం లేదు. ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన నలుగురు నేతలకు సొంత కులంలోనే పోటీ తప్పని పరిస్థితి. ఇతర సామాజికవర్గాలకు చెందిన మరో 12 మంది అభ్యర్థులు వేములవాడలో పోటీ పడడం గమనార్హం.

మద్దతు కూడగట్టేందుకు కష్టాలు

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో సొంత సామాజికవర్గ, కులసంఘాల మద్దతు కూడగట్టడం ఇబ్బందిగా మారింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీపడుతుండడంతో ఆయా కులసంఘాల నేతల్లో భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రధాన పార్టీల అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. ఎన్నికల రంగంలోకి దిగిన ఆయా కుల సంఘాల నాయకులు సైతం సామాజికవర్గాలను ఒకే తాటిపైకి తేలేకపోతున్నారు. జిల్లాలో సంకుల సమరం ఆసక్తికరంగా మారింది.



అడుగడుగునా తనిఖీలు

ఎన్నికల కోడ్‌ అమలులోకి రావడంతో ఎక్కడికక్కడ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ చౌరస్తా వద్ద గురువారం కేంద్ర సాయుధ బలగాలు వాహనాల తనిఖీ చేపట్టాయి. నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలింపు, మద్యం సరఫరా, ఇతరత్ర వస్తువులు తరలిస్తున్నారనే కోణంలో తనిఖీలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల





ఈవీఎంల పనితీరును పరిశీలించాలి

- పోస్టల్‌ బ్యాలట్‌ను వినియోగించుకోవాలి
- కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి



సిరిసిల్ల బాలికల హైస్కూల్‌లో ఈవీఎంల పనితీరు పరిశీలిస్తున్న కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి

సిరిసిల్ల: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంల కమిషనింగ్‌ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, వేములవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈవీఎంలపై సీరియల్‌ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, కేటాయించిన చిహ్నాల ఏర్పాటు పక్కాగా నిర్వహించాలన్నారు. కమిషనింగ్‌ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోలింగ్‌ నిర్వహించి, ఈవీఎంల పనితీరు పరిశీలించాలని సూచించారు. రెండోవిడత ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మిషన్ల నంబర్లను కంట్రోల్‌ యూనిట్‌, బ్యాలట్‌ యూనిట్‌, వీవీప్యాట్‌లను ఆయా పోలింగ్‌ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌ నిర్వహణ తదితర అంశాల గురించి ఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్‌ ఎన్‌. ఖీమ్యా నాయక్‌, సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్‌ అధికారులు ఎస్‌.ఆనంద్‌కుమార్‌, మధుసూదన్‌ తదితరులు ఉన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్‌ బ్యాలట్లు

ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్‌ బ్యాలట్లను వినియోగించుకోవాలని కలెక్టర్‌ కోరారు. ఇది వరకే ఫారం–12 ద్వారా పోస్టల్‌ బ్యాలట్‌ కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బందికి పోస్టల్‌ బ్యాలట్‌ అవకాశం ఉందన్నారు. సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్‌ కార్యాలయాలలో పోస్టల్‌ బ్యాలట్‌ వినియోగం కోసం ఫెలిసిటేషన్‌ సెంటర్‌ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 24 నుంచి 28 వరకు సిబ్బంది పోస్టల్‌ బ్యాలట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్‌ స్పష్టం చేశారు.

ఎన్నిక ఏదైనా.. కౌంటింగ్‌ ఇక్కడే..!

- తంగళ్లపల్లి మండలానికే అధికారుల ప్రాధాన్యం
- బద్దెనపల్లి గురుకులంలో కౌంటింగ్‌ కేంద్రం
- పలుమార్లు పరిశీలించిన అధికారులు



కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రత చర్యలపై చర్చిస్తున్న పోలీసు అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లాలో ఏ ఎన్నికలు జరిగిన స్ట్రాంగ్‌రూములు, ఓట్ల కౌంటింగ్‌ కేంద్రాలు తంగళ్లపల్లి మండలంలోనే ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉండడం, రవాణా సౌకర్యం, అనుకూలమైన భవనాలు అందుబాటులో ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. రాజన్నసిరిసిల్ల జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన ఎన్నికలకు తంగళ్లపల్లిలోనే ఈవీఎం, బ్యాలట్‌ బాక్సుల స్ట్రాంగ్‌రూమ్‌, కౌంటింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికలకు సైతం తంగళ్లపల్లి మండలమే ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రానికి అనువైనదిగా అధికారులు గుర్తించారు.

అందుబాటులో అనువైన భవనాలు

తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, మండెపల్లిలో గురుకుల, మోడల్‌స్కూల్‌ భవనాలతోపాటు అత్యంత విశాలమైన ప్రభుత్వ ఐటీఐ భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఈవీఎంలు, బ్యాలట్‌బాక్సులు భద్రపరచడంతోపాటు కౌంటింగ్‌ కోసం ఈ భవనాలు ఉపయోగకరంగా ఉంటాయి. విశాలమైన పార్కింగ్‌ స్థలాలు, చుట్టూ పటిష్టమైన ప్రహరీ, జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్లలోపు దూరం ఉండడంతో అధికారులు ఇక్కడే ఏర్పాట్లు చేస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఇక్కడే..

వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలు ఉండగా 2018లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో తంగళ్లపల్లిలోనే కౌంటింగ్‌ కేంద్రం ఏర్పాటు చేశారు. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరు కౌంటింగ్‌ కేంద్రాలను బద్దెనపల్లి బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేశారు. రెండు నియోజకవర్గాల కౌంటింగ్‌ కేంద్రాలకు ఒకే చోట అనువైన భవనం లభించడంతో అధికారులకు ప్రయాస తప్పింది. భద్రత విషయంలోనూ ఎక్కువగా శ్రమించాల్సిన అవసరం లేదు.

అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు

అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మరోమారు తంగళ్లపల్లి మండలాన్నే అధికారుల ఎంచుకున్నారు. ఇప్పటికే బ్యాలట్‌ బాక్సులను భద్రపరిచేందుకు, కౌంటింగ్‌ కేంద్రాల కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. బద్దెనపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలను స్ట్రాంగ్‌ రూమ్‌, కౌంటింగ్‌ కేంద్రాలుగా నిర్ణయించి ఏర్పాట్లు చేస్తున్నారు.

పటిష్ట బందోబస్తు



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గురుకుల పాఠశాలను ఈవీఎం లాక్‌రూమ్‌, ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఎంపిక చేశాం. ఈ ప్రాంతంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశాం. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

– అఖిల్‌ మహాజన్‌, ఎస్పీ

సమర్థంగా నిర్వహిస్తాం



వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్‌ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఓటర్లకు, అధికారులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. బద్దెనపల్లిలో కౌంటింగ్‌ కేంద్రాన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– అనురాగ్‌ జయంతి, కలెక్టర్‌

న్యూస్‌రీల్‌

ఓట్ల కోసం వచ్చేవాళ్లను ప్రశ్నించండి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి



అంబేడ్కర్‌ చౌరస్తాలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్‌: ప్రజల ఓట్లతో గెలిచి సమస్యల పరిష్కారంలో పట్టింపులేకుండా ఉంటున్న రాజకీయ నాయకులు ఓట్ల కోసం వస్తే ప్రశ్నించండని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి కోరారు. 'ఓట్ల కోసం వచ్చే వారిని ప్రశ్నించండి' అనే నినాదంతో సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన ముద్రించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలను గాలికొదిలేసి వారి లబ్ధికే పాటుపడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంలో లక్షలాది కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. అవినీతి నాయకులను ఇంటికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార వినోద్‌, గడ్డం సంజీవ్‌కుమార్‌, బాలసాని రాజయ్య, మార్వాడి సుదర్శన్‌, మేకల కమలాకర్‌, దర్శనం కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగం



కొలనూర్‌లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న వికలాంగులు

కోనరావుపేట(వేములవాడ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొలనూర్‌, గొల్లపల్లి గ్రామాల్లో ఇంటి వద్దనే ఓటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు అనిల్‌ చౌహాన్‌, ప్రిసైడింగ్‌ అధికారి కాసుల రవీందర్‌ దివ్యాంగుల ఇంటికి వెళ్లి ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. కొలనూర్‌లో 8 మంది, గొల్లపల్లిలో నలుగురు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దివ్యాంగులకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని వనియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా హోమ్‌ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటికి వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. బూత్‌లెవల్‌ అధికారి మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

అలా వెళ్లారు.. ఇలా వచ్చారు



ప్రతాప రామకృష్ణ సమక్షంలో బీజేపీలోకి వస్తున్న వెంకట్‌

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల వేళ నాయకుల పార్టీ ఫిరాయింపులు మరోసారి చర్చకు వచ్చాయి. ఇలా వెళ్తూ.. అలా తిరిగొస్తున్నారు. ఎవరూ ఎప్పుడు ఏ పార్టీ కండువా కప్పుకుంటున్నారో అయోమయంగా మారింది. మండల స్థాయి నాయకులు ఇలా జెండాలు మార్చుతుంటే.. ఈ విషయమై ప్రజల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి. తంగళ్లపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు సురువు వెంకట్‌తోపాటు బీజేవైఎం మండలాధ్యక్షుడు కోల ఆంజనేయులు ఇటీవల కమలానికి టాటా చెప్పి కారెక్కారు. వెళ్లి వారం కూడా కాకుండా కారులోంచి దూకి కమలాన్ని పట్టుకున్నారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో కాషాయం కండువా కప్పుకున్నారు.

బైండోవర్‌ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

సిరిసిల్లక్రైం: సత్ప్రవర్తన కోసం బైండోవర్‌ చేసిన వ్యక్తి నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.30 వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి గురువారం తెలిపారు. ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌కు చెందిన రంగు శ్రీనివాస్‌, అనంతారం గ్రామానికి చెందిన తీగల కనకయ్యలకు ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. వీరిద్దరు బెల్టుషాపులో మద్యం విక్రయించారని, వారిలో మార్పు కోసం బైండోవర్‌ చేశామన్నారు. బైండోవరైన వ్యక్తులు కనీసం ఆరు నెలలు నేరాలు చేయకుండా ఉండాలని బంధనలున్నాయని, వాటిని పాటించాలని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి సూచించారు.

బీఆర్‌ఎస్‌ను నమ్ముకుంటే ఉన్నది అమ్ముకున్నట్టే..



సారంపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న తీన్మార్‌ మల్లన్న

- సిరిసిల్లలో కేటీఆర్‌ ఓడిపోవడం ఖాయం
- కాంగ్రెస్‌ నాయకుడు తీన్మార్‌ మల్లన్న
- తంగళ్లపల్లి మండలంలో కాంగ్రెస్‌ రోడ్‌ షో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి కేకే.మహేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు కాంగ్రెస్‌ నాయకుడు తీన్మార్‌ మల్లన్న అలియాస్‌ చింతపండు నవీన్‌ అన్నారు. తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో స్థానిక కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే.మహేందర్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించి రోడ్‌షోలో పాల్గొన్నారు. తీన్మార్‌ మల్లన్న మాట్లాడుతూ సిరిసిల్లలో ల్యాండ్‌, సాండ్‌ మాఫియా నడుస్తోందని ఆరోపించారు. అంకిరెడ్డిపల్లెలో మస్కట్‌ పోయేటోళ్లను మోసం చేస్తే గతంలో కేసీఆర్‌ను స్తంభానికి కట్టేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ పార్టీని నమ్ముకుంటే ఉన్నది అమ్ముకున్నట్టే అని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ముద్దుబిడ్డ కేకే మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలుచేసి ప్రజారంజక పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ జిల్లా నాయకులు జాలగం ప్రవీణ్‌కుమార్‌(టోని), వైద్యశివప్రసాద్‌, నాగుల సత్యనారాయణ, సూర దేవరాజు, లింగాల భూపతి, ఉపసర్పంచ్‌ పర్శరాములు, రాములు, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్‌, గడ్డం మధుకర్‌(ఛోటు), భరత్‌ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలవాడగా మారుస్తా

- స్థానికంగా ఉంటాను... సమస్యలు పరిష్కరిస్తాను
- 'సాక్షి'తో కాంగ్రెస్‌ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌



వేములవాడ: ఈ ప్రాంత బిడ్డగా.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా, మీ మధ్యలోనే ఉంటూ మీ సమస్యలపై ప్రతి నిత్యం కొట్లాడుతున్నాను అని వేములవాడ కాంగ్రెస్‌ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ అన్నారు. వేములవాడను వెన్నెలవాడగా మార్చుతానన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: వేములవాడ రాజన్న గుడి అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి?

ఆది : డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నేను రెండు పర్యాయాలు ఆలయ చైర్మన్‌గా పనిచేసిన. భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. తెలంగాణ వచ్చినాక ఒక్క పైసా పని కూడా కాలేదు. రాజన్న గుడి సాక్షిగా ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తామన్న సీఎం కేసీఆర్‌ ఒక్క రూపాయి ఇవ్వలేదు. భక్తుల కష్టాలు, గుడి అభివృద్ధిపై అనేక పర్యాయాలు ఆందోళనలు చేశాం. అయినా ఎలాంటి మార్పు కనిపించలేదు. నేను గెలిస్తే రాజన్న ఆలయాన్ని దేశంలోనే అగ్రగామిగా ఉంచుతాను.

సాక్షి : వేములవాడ పట్టణం అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి ?

ఆది: వేములవాడ పట్టణం ఆనాడు ఎలా ఉందో ఈనాడూ అలాగే ఉంది. నక్షలు, రంగుల బ్రోచర్లు తప్ప ఎక్కడా అభివృద్ధి చేపట్టిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి వేములవాడకు వస్తున్న జనం ఇక్కడి అధ్వాన్న పరిస్థితులు చూసి ఆందోళన చెందుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లడం, చుట్టపుచూపుగా రావడం, అధికారులతో హడావిడి సమావేశాలు పెట్టడం తప్ప చేసిందేమి లేదు. వేములవాడను వెన్నెలవాడగా మార్చుతాను.

సాక్షి : రైతులను ఎలా ఆదుకుంటారు ?

ఆది : నేను ఓ రైతు బిడ్డనే. అన్నదాతల కష్టాలు తెలుసు. రైతుల కోసం దివంగత మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి పుణ్యమా అంటూ మెట్ట ప్రాంతమైన వేములవాడకు గోదావరిజలాలు ఫాజుల్‌నగర్‌ రిజర్వాయర్‌ ద్వారా చేరుతున్నాయి. నన్ను గెలిపిస్తే ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తా.

సాక్షి : నియోజకవర్గ అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి?

ఆది: ఈ నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఏ సమస్య ఉందో నాకు తెలుసు. ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసు. ఈ ప్రాంతవాసులు నన్ను ఆశీర్వదిస్తే ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతాను.

సాక్షి : విద్య, వైద్యం, రవాణాపై మీ ప్లాన్‌ ఏమిటి ?

ఆది : విద్య విషయంలో ఈ ప్రాంతం చాలా వెనుకబడి ఉంది. మహిళా జూనియర్‌, మహిళా డిగ్రీ కళాశాలలు లేవు. నేను గెలవగానే వీటిని ఏర్పాటు చేస్తాను. మండలానికో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటు చేయిస్తాను. ప్రతీ గ్రామానికి డబుల్‌రోడ్డు వచ్చేలా కృషి చేస్తాను.

సాక్షి : ముంపుగ్రామాలు, యువతకు ఎలాంటి ఉపాధి చూపిస్తారు?

ఆది : మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది. సీఎం కేసీఆర్‌ రాజన్న గుడి మెట్ల సాక్షిగా నిర్వాసిత ఒక్కో కుటుంబానికి రూ.5.04 లక్షలు ఇస్తామని ప్రకటించి మోసం చేశారు. నేను గెలవగానే ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తాను. యువత కోసం పరిశ్రమలు తీసుకొస్తాను. ఐటీపార్క్‌, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్స్‌ నిర్వహిస్తాను.

సాక్షి : మహిళల సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యతనిస్తారు?

ఆది : ఇంటికి దీపం ఇల్లాలు. ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగుంటుంది. మహిళల అభివృద్ధికి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చి వారికి కుటీర పరిశ్రమలు స్థాపిస్తాను. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తాను.

క్లుప్తంగా

భార్య మాట వినలేదని భర్త ఆత్మహత్య

- అనంతపల్లిలో విషాదం


బాబు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తన మాట భార్య వినలేదని మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనంతపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. అనంతపల్లికి చెందిన బైరి బాబు(48)–లత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్నకూతురు అదే గ్రామానికి చెందిన యువకుడిని ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో చిన్నకూతురిని మరిచిపోదామని ఆ దంపతులు నిశ్చయించుకున్నారు. అయితే చిన్నకూతురుకు గురువారం పాప పుట్టింది. ఈ విషయం తెలుసుకున్న బాబు భార్య లత ఆస్పత్రికి వెళ్లి చూసి వచ్చింది. ఈ విషయం తెలిసిన బాబు మనస్తాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు మృతి


భూక్య లింగమూర్తి(ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): తండ్రి మరణాన్ని తట్టుకోలేక మనోవేదనతో కొడుకు మృతిచెందిన సంఘటన మండలంలోని భూక్యతండాలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. భూక్య శంకర్(48) తన కొడుకు ఆరోగ్యం బాగు చేయించేందుకు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి.. వాటిని తీర్చే మార్గం కనిపించక గత వారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తండ్రి మరణించినప్పటి నుంచి కొడుకు లింగమూర్తి(36) మానసిక వేదనకు గురవుతున్నాడు. తండ్రి లేని లోటు తాను భరించలేనని గురువారం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. వారం రోజుల వ్యవధిలో తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడికి తల్లి రేణ, భార్య కవిత, కూతురు అశ్విత, కొడుకు వంశీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడ్డ యువకుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న అక్కపల్లికి చెందిన రాజును ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజును స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత మాది.. బాధ్యత మీది

- జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- శివారు గ్రామాల వరకు ఫ్లాగ్‌మార్చ్
- అడుగడుగునా సాధారణ, డైనమిక్ తనిఖీలు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి
- జిల్లాను జల్లెడ పట్టేస్తున్న బీఎస్‌ఎఫ్ బలగాలు


భద్రత కోసం జిల్లా కేంద్రంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్ ఫ్లాగ్‌మార్చ్

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని విధాలా సిద్ధమైంది. బందోబస్తు, భద్రత చర్యలపై ఎస్పీ అఖిల్‌మహాజన్ ఇప్పటికే పలు మార్లు సమీక్షలు నిర్వహించారు. ఎన్నికల ముందు రోజు, ఈవీఎం మిషన్స్ పంపించే సమయం, స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు రోజు విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు భద్రత చర్యలను పటిష్టం చేశారు.

జిల్లాను జల్లెడ పట్టేశారు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి ఒక వైపు కేంద్ర సాయుధ బలగాలు, మరోవైపు జిల్లా పోలీసు యంత్రాంగం ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తూ ఓటర్లలో భరోసానిస్తున్నారు. అసాంఘిక శక్తులకు చోటులేదని, ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవచ్చని పోలీస్ అధికారులు పల్లెల్లో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన రగుడు, మానాల, మరిమడ్ల, బోయినపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లోని చివరి గ్రామాల్లోనూ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు.

భారీగా నగదు పట్టివేత

జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతుంది. శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించే శక్తులపై దృష్టి పెట్టారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సరఫరా చేసే మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

గత ఎన్నికల్లో జరిగిన ఘటనల ఆధారంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 77 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. వీటిలో ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. సభలు, సమావేశాలు, ఆశీర్వాదసభల పేరిట వివాదాలను సృష్టించేందుకు ప్రయత్నించే వారి సమాచారాన్ని 360 డిగ్రీల రొటేట్ కెమెరాలతో గుర్తిస్తున్నారు.

కోడ్ పకడ్బందీగా అమలు

జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పగడ్బందీగా అమలు చేస్తున్నాం. మాకు వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నాం. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు. ఓటును నిర్భయంగా, స్వేచ్ఛగా వేయాలి. ఏదేని సమస్య ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలి. – అఖిల్ మహాజన్, ఎస్పీ

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు ఇలా..

నమోదైన కేసులు	: 15
పట్టుబడిన నగదు	: రూ.87,93,945
పట్టుబడిన గంజాయి	: 32 కిలోలు
పట్టుబడిన మద్యం	: 1,203 లీటర్లు
బైండోవర్ కేసులు	: 631
బైండోవర్ అయిన వ్యక్తులు	: 1,582

బందోబస్తు వివరాలు

అసిస్టెంట్ కమాండెంట్స్	: 02
సీఐలు	: 01
ఎస్సైలు	: 06
ఏఎస్సైలు	: 15
హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్	: 136

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు


బద్దెనపల్లి గురుకులాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. ఈమేరకు గురువారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పీడ్ ఇంటర్నెట్‌తోపాటు, కమ్యూనికేషన్, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్, భద్రత చర్యలు, వీడియోగ్రఫీ, ఫైర్‌సేఫ్టీ, సిబ్బందికి భోజన సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధన మేరకు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, డీపీఆర్వో దశరథం, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరు పరిశీలన

వేములవాడ: ఈవీఎంల పనితీరును కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ప్రభుత్వ హైస్కూల్‌కు చేరుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

దొంగతనానికి వచ్చి.. పోలీసులు వచ్చారని

- త్రుటిలో తప్పించుకున్న ఆగంతకుడు

ధర్మపురి: చోరీకి యత్నించిన ఓ ఆగంతకుడు పోలీసుల అలికిడి విని త్రుటిలో తప్పించుకుపోయిన ఘటన గురువారం ధర్మపురిలో చోటుచేసుకుంది. పట్టణంలోని కోనేరు వెనుకభాగంలో బ్రాహ్మణ వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు పెండాల రవికుమార్ రాజశ్రీ దంపతులు నివాసముంటున్నారు. గురువారం రవికుమార్ సమీపంలోని ఆలయానికి ఆలయానికి వెళ్లాడు. రాజశ్రీ కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. అదే సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సామగ్రి సర్దుతున్నాడు. రాజశ్రీ ఇంటికి రాగా లోపల గడియపెట్టి ఉండడాన్ని గమనించింది. విషయాన్ని చుట్టుపక్కల వాళ్లకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ చేరుకున్నారు. పోలీసులు వచ్చిన విషయాన్ని గమనించిన ఆగంతకుడు వెనుకడోర్ నుంచి పరారయ్యాడు. నిత్యం జన సంచారముండే బ్రాహ్మణ వీధిలో చోరీకి యత్నించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

కల్వర్టుల కష్టాలు తీర్చాలి

- వానాకాలంలో రాకపోకలకు అంతరాయం
- ఇతర ప్రాంతాలతో తెగుతున్న బంధాలు
- ఏటా తాత్కాలిక మరమ్మతులతో సరి
- శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న ప్రజలు

‘ఈ కల్వర్టు బోయినపల్లి నుంచి మర్లపేట, విలాసాగర్ గ్రామాల మీదుగా కరీంనగర్ వెళ్లే దారిలో ఉంది. కరీంనగర్ వెళ్లేందుకు దూరభారం తగ్గుతుందని ఈ దారిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ప్రతీ వానాకాలంలో ఈ కల్వర్టు తెగడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఏటా సుమారు రూ.5 లక్షల నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. ఈఏడాది జూలై 27న కురిసిన వర్షాలకు మళ్లీ తెగింది. తాత్కాలిక మరమ్మతులకు లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదు. కొద్దిరోజుల క్రితం ఇక్కడ బండ రాళ్లు తీసుకెళ్తున్న ట్రాక్టర్ దిగబడి టేలర్ పడిపోయి పెద్ద ప్రమాదం తప్పింది’.


బోయినపల్లి-విలాసాగర్ మధ్య తాత్కాలిక మరమ్మతు చేసిన కల్వర్టు ఇలా..



బోయినపల్లి- విలాసాగర్ రోడ్డులో తెగిన కల్వర్టు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఉన్న లో లెవల్ కల్వర్టులపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఏటా వర్షాకాలంలో కల్వర్టులపై నీరు ఉధృతంగా ప్రవహించి మండల కేంద్రం నుంచి కరీంనగర్, సిరిసిల్లా జిల్లాలకు రాకపోకలు నిలిచిపోతాయి. నాలుగేళ్లుగా ఏటా వానాకాలంలో బోయినపల్లి గ్రామ పరిసరాల్లోని మూడు కల్వర్టులు, స్తంభంపల్లి గంజివాగు వద్ద వంతెనపై ప్రయాణం చుక్కలు చూపెడుతోంది. తాత్కాలిక మరమ్మతులు చేపడుతుండటంతో కల్వర్టులు తెగిపోయి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు ఆగిపోతాయి. వైద్యం అవసరమైన, ఆపద సమయంలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులతో ప్రజా ధనం వృథా అవుతోందని జనం అంటున్నారు.

ఎన్నికల వేళ..

వర్షాకాలంలో మండల కేంద్రం నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే దారుల్లో కల్వర్టులు తెగడంపై ఎన్నికల సమయంలో ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థులు శాశ్వత ప్రాతిపదికన హై లెవల్ బ్రిడ్జీల నిర్మాణం కోసం స్పష్టమైన హామీలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి మౌలికవసతులను విస్మరించే నాయకుల మాటలు నమ్మవద్దని ప్రజలు అనుకుంటున్నారు.

మొదలుకాని హైలెవల్ బ్రిడ్జి పనులు

బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో స్తంభంపల్లి గంజివాగు వద్ద హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. ఆగస్టు 28న పనులకు భూమిపూజ చేశారు. రెండు నెలలు గడిచినా పనులు మొదలు కాకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. బోయినపల్లి పరిసరాల్లో రూ.2 కోట్ల అంచనాలతో బ్రిడ్జి నిర్మాణానికి లైన్ ఎస్టిమేట్‌తో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు.

సిరిసిల్ల వెళ్లాలంటే ఇబ్బందులు



వానాకాలంలో బోయినపల్లి నుంచి సిరిసిల్ల, వేములవాడ వెళ్లాలంటే చిన్న వర్షం కురిసినా బోయినపల్లి కల్వర్టు, స్తంభంపల్లి గంజివాగుపై వరద పారుతుంది. చాలా మంది తమ అవసరాలకు ఆ కల్వర్టుల మీదుగా రాకపోకలు సాగిస్తారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
– ఆడెపు రాజమౌళి, వస్త్ర వ్యాపారి, బోయినపల్లి

స్లాబ్ బ్రిడ్జి నిర్మించాలి



బోయినపల్లి నుంచి మర్లపేట, విలాసాగర్ గ్రామాల మీదుగా కరీంనగర్ వెళ్లే బీటీ రోడ్డులో ఉన్న కల్వర్టు ప్రతీ వర్షాకాలంలో తెగిపోతోంది. ఇప్పటికి నాలుగుసార్లు తెగిపోయినా తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రయాణం ప్రమాదంగా మారింది. ఇక్కడ స్లాబ్ బ్రిడ్జి నిర్మించాలి.
– బొజ్జ నరేశ్, బోయినపల్లి

ప్రజాధనం వృథా



బోయినపల్లి నుంచి కొదురుపాక మీదుగా సిరిసిల్ల, కరీంనగర్ వెళ్లే డబుల్ రోడ్డులో ఉన్న కల్వర్టుపై వర్షాకాలంలో భారీగా నీరు ప్రవహిస్తుంది. గత వానాకాలంలో కల్వర్టు కింద పైపులు ఊడిపోయి కుంగిపోగా మరమ్మతు చేశారు. తాత్కాలిక మరమ్మతులతో ప్రజాధనం వృథా అవుతోంది.
– పొన్నం పర్శరాములు, దేశాయిపల్లి

నాయకులు శ్రద్ధచూపాలి



బోయినపల్లి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే ముఖ్యమైన కల్వర్టులు ఏటా తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వంతెనలను శాశ్వత ప్రాతిపదికన బాగు చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కృషి చేయాలి.
– మాడిశెట్టి విజయ్‌కుమార్, బోయినపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడు రాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో గురువారం బైక్, మారుతి ఈకో వాహనం ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాజు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

రేపు వేములవాడకు రాహుల్‌గాంధీ రాక

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు వేములవాడకు వస్తున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గురువారం తెలిపారు. శాత్రాజుపల్లి రోడ్డులోని సాయిరక్ష దాబా వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడుతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, నియోజకవర్గప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- మొదలైన వేడుకలు
- ముస్తాబైన వేణుగోపాలుడి ఆలయం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- సిద్ధమైన పెద్దరథం
- వెలసిన దుకాణాలు


ఉత్సవాలకు అలంకరించిన ఆలయం


జాతర గ్రౌండ్‌లో వెలసిన దుకాణాలు


ముస్తాబైన పెద్ద రథం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బ్రహ్మోత్సవాలకు మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ముస్తాబైంది. పెద్దరథానికి రంగులు వేయడంతోపాటు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. కార్తీకమాసంలో ఏటా అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నాయకులు సైతం హడావిడి చేస్తున్నారు. వారం రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈనెల 22న మొదలై 27వ తేదీ వరకు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం పెద్ద రథం ఊరేగింపు ఆకర్షణగా ఉంటుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఇలా..

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22న ఆలయ సంప్రోక్షణతో పండితులు ప్రారంభించారు. ఈనెల 23, 24న రెండు రోజులు సాధారణ పూజలు ఉండగా, 25 నుంచి ప్రధాన ఘట్టం ప్రారంభంకానుంది. ఈనెల 25న ఉదయం ఎదుర్కోళ్లు, శ్రీరుక్మిణీ– సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగింపు తీస్తారు. 26న హనుమాన్ వాహనంపై ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 27న మరో ప్రధాన ఘట్టం స్వామివారి పెద్దరథాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తారు. అదే రోజు రాత్రి కార్తీకమాసం జాతర నిర్వహిస్తారు. రాత్రి 11.30 గంటలకు స్వామి వారి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వేదపండితులు వివరించారు.

ఆరు జిల్లాల నుంచి..

ఎల్లారెడ్డిపేటలో జరిగే బ్రహ్మోత్సవాలు చూసేందుకు హైదరాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి వారం రోజులు నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈనెల 25, 27 తేదీలలో ఆరు జిల్లాలకు చెందిన భక్తులు ఎక్కువగా హాజరవుతారు. తండాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో వస్తారు. బ్రహ్మోత్సవాలకు ముందుగానే ఆ సమీపంలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన యంత్రాలు ఏర్పాటయ్యాయి. సర్కస్‌ను తలదన్నేలా జాయింట్‌వీల్(రంగుల రాట్నం), చిన్నపిల్లలు ఆడుకునే అనేక రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. మిఠాయి దుకాణాలు వెలిశాయి.

ఉత్సవాలపై పోలీసుల కన్ను

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ కమిటీ పాలకవర్గాన్ని మార్చడంతో పాత, నూతన కమిటీల మధ్య అభిప్రాయబేధాలు చోటుచేసుకున్నాయి. రెండు కమిటీలు కూడా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు అన్ని చర్యలు చేపట్టారు. ఉత్సవాలు ముగిసే వరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏర్పాట్లు చేశాం



బ్రహ్మోత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో అదే స్థాయిలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఈసారి గ్రామస్తుల సహకారంతో వేడుకలను వైభవంగా పూర్తి చేస్తాం. వారం రోజులు జరిగే ఉత్సవాలకు గ్రామస్తులు సహకరిస్తున్నారు.
– గడ్డం జితేందర్, ఆలయ కమిటీ చైర్మన్

ప్రశాంతంగా జరుపుకోవాలి



శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం. వారంపాటు జరిగే ఉత్సవాలపై పోలీసుల దృష్టి ఉంటుంది. జాతరకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తాం. ప్రశాంతతకు గ్రామస్తులు సహకరించాలి.
– శేఖర్‌రెడ్డి, సీఐ, ఎల్లారెడ్డిపేట